నీటి నిల్వలతో దోమల వ్యాప్తి

- ఇంటింటా పరిశుభ్రతపై ఆశా కార్యకర్తల అవగాహన...



హనుమకొండ జిల్లా / భీమదేవరపల్లి / అక్టోబర్ 23/అక్షరం న్యూస్:-

భీమదేవరపల్లి మండలం కొప్పూర్ గ్రామంలో శుక్రవారం వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ రెహమాన్ సూచనల మేరకు ఆశా కార్యకర్త కొమ్ముల స్వరూప రాణి ఇంటింటా తిరుగుతూ పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.ఇళ్ల పరిసరాల్లోని పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ పాత్రల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. నీటి నిల్వల వల్ల దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని వివరించారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని దోమల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు.

బంజపల్లిలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్



మద్నూర్ / అక్షరం న్యూస్ -- కామారెడ్డి:

కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండల పరిధిలోని బంజపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల గృహప్రవేశ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. నూతన గృహంలో లబ్ధిదారుల కుటుంబాలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాల సొంతింటి కల సాకారమవుతుండటం సంతోషకరమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా సొంత ఇంటి కోసం ఎదురుచూసిన లబ్ధిదారుల కుటుంబాల్లో గృహప్రవేశ వేడుకతో ఆనందం వెల్లివిరిసింది.ఈ కార్యక్రమంలో నిజాంసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రజా పండరి, గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ-1లో అంతర్ విభాగ క్రికెట్ పోటీలు ప్రారంభం



జ్యోతినగర్, ఎన్టీపీసీ అక్టోబర్ 23 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

సింగరేణి రామగుండం ఏరియా-1 పరిధిలోని ఉద్యోగుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతోపాటు, ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో శుక్రవారం అంతర్ విభాగ క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ రామగుండం ఏరియా-1 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను ఆర్జీ-1 ఎస్‌వో టు జీఎం చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు ఉద్యోగుల్లో శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతోపాటు, క్రమశిక్షణ, జట్టుగా పనిచేసే నైపుణ్యాన్ని అభివృద్ధి చేస్తాయని అన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడి అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించాలని ఆకాంక్షించారు. సింగరేణి సంస్థ క్రీడలకు ప్రాధాన్యమిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తోందని, ఆర్జీ-1 ప్రాంతానికి చెందిన క్రీడాకారులు జాతీయ స్థాయితోపాటు కోల్ ఇండియా స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచి సంస్థకు, ప్రాంతానికి గుర్తింపు తీసుకురావాలని పిలుపునిచ్చారు.ఈ పోటీల్లో ఆర్జీ-1 పరిధిలోని వివిధ గనులు, విభాగాలకు చెందిన జట్లు పాల్గొంటున్నాయి. ప్రారంభ కార్యక్రమంలో వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ గౌరవ కార్యదర్శి హనుమంతరావు, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ గాండ్ల రాజయ్య, కెప్టెన్ హరికిషన్, కెనెడి, భరత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దెగ్లూర్‌లో అక్టోబర్ 24న ఘనంగా సార్వజనిక బతుకమ్మ ఉత్సవం

- మహిళలందరూ భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలి: నగర పరిషద్ చైర్మన్ విజయమాల టెకాలే పిలుపు

దెగ్లూర్ / అక్టోబర్ 23 (అక్షరం న్యూస్ - కామారెడ్డి):

మహిళల ఆత్మగౌరవానికి, సంప్రదాయానికి, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే అపురూపమైన పూల పండుగ 'బతుకమ్మ'. ఈ చారిత్రక సంస్కృతిని కేవలం తెలంగాణలోనే కాకుండా సరిహద్దు ప్రాంతాలైన మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా దెగ్లూర్ పట్టణంలోనూ అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటేలా దెగ్లూర్ లో 'సార్వజనిక బతుకమ్మ ఉత్సవం--2026'ను ఘనంగా నిర్వహించనున్నట్లు నగర పరిషద్ చైర్మన్ విజయమాల బాలాజీ రావ్ టెకాలే ప్రకటించారు.

అక్టోబర్ 24న వైభవంగా బతుకమ్మ సంబరాలు

శనివారం, అక్టోబర్ 24, 2026న దెగ్లూర్ పట్టణంలోని ప్రసిద్ధ సార్వజనిక విసర్జన ఘాట్ వేదికగా ఈ వేడుకలు



కన్నులపండువగా సాగనున్నాయి. ఈ సందర్భంగా పట్టణంలోని మహిళలు తంగేడు, గునుగు, చామంతి వంటి రంగురంగుల అచ్చమైన పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, సాంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడనున్నారు.తరతరాల మన సంస్కృతిని, ఐక్యతను భావితరాలకు అందించాలనే సత్సంకల్పంతో ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మహిళలకు అంకితమైన వేడుక - పెద్దఎత్తున తరలిరావాలని పిలుపు

నగర పరిషత్ అధ్యక్షురాలు విజయమాల బాలాజీ రావు దంపతుల ఆధ్వర్యంలో ఈ వేడుకలను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్నారు. ఈ వేడుకల సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ...?"బతుకమ్మ పండుగ కేవలం ఒక పూల వేడుక మాత్రమే కాదు; అది మహిళల ఐక్యతకు, ప్రకృతి పట్ల మన ప్రేమకు ప్రతీక. దెగ్లూర్ పట్టణంలోని మహిళలు, బతుకమ్మ అభిమానులు, తెలంగాణ సంస్కృతిని ప్రేమించే ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా తరలివచ్చి ఈ సంబరాలను విజయవంతం చేయాలని కోరుతున్నాను"?అని ఆమె విజ్ఞప్తి చేశారు.సాంప్రదాయ నృత్యాలు, పూల శోభ, భక్తిభావం ఉట్టిపడే పాటలతో ఉత్సవ ప్రాంగణం మొత్తం కోలాహలంగా మారనుంది. తెలంగాణ, మహారాష్ట్రల సాంస్కృతిక అనుబంధాన్ని చాటే ఈ అద్భుత వేడుకలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

ఆదివాసీల పంటలను ధ్వంసం చేయడం దారుణం





- పంట నష్టపోయిన గిరిజన రైతులకు పరిహారం చెల్లించాలి
- బాధితులకు అండగా ఉంటాం.. న్యాయం జరిగే వరకు పోరాడతాం: తంబళ్ల రవి

భద్రాద్రి కొత్తగూడెం / అశ్వారావుపేట / అక్టోబర్ 23 / అక్షరం న్యూస్ :అశ్వారావుపేట మండలం రామన్నగూడెం గ్రామంలో అటవీ శాఖ అధికారుల చర్యలతో పంట నష్టపోయిన ఆదివాసీ రైతు కుటుంబాలను బీజేపీ నాయకులు తంబళ్ల రవి పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత రైతులు తమకు జరిగిన నష్టాన్ని, ఎదుర్కొంటున్న ఇబ్బందులను నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. తాము నమ్ముకున్న భూముల్లో సాగు చేసుకుంటున్న పంటలను ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ధ్వంసం చేయడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

పేద ఆదివాసీలకు అన్యాయం చేయొద్దు

ఈ సందర్భంగా తంబళ్ల రవి మాట్లాడుతూ.. నిరుపేద ఆదివాసీ కుటుంబాల జీవనాధారమైన పంటలను ధ్వంసం చేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. పోడు భూముల్లో సాగు చేసుకుంటున్న గిరిజనులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వాలు, అధికారుల ద్వారా వారిని ఇబ్బందులకు గురిచేయడం తగదని పేర్కొన్నారు. అటవీ శాఖ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించి ఆదివాసీల పంటలను నాశనం చేయడం సరికాదని అన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి

పంట నష్టపోయిన ఆదివాసీ రైతు కుటుంబాలకు ప్రభుత్వం తగిన నష్టపరిహారం చెల్లించాలని తంబళ్ల రవి డిమాండ్ చేశారు. గిరిజన రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా అధికారులు వ్యవహరించాలని కోరారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ పార్టీ తరఫున పోరాటం కొనసాగిస్తామని, వారికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మడకం నాగేశ్వరరావు, బీజేపీ నాయకులు కొండా, శ్రీనివాసరావు, ఆదివాసీ రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ. 40 లక్షల ప్రమాద బీమా చెక్కు అందజేత

- ఎస్‌బీఐ మద్నూరు శాఖ చొరవ.. అకాల మరణం చెందిన బాలాజీ కుటుంబానికి ఆర్థిక భరోసా

మద్నూర్ / అక్టోబర్ 23 (అక్షరం న్యూస్ -- కామారెడ్డి):

మద్నూరుకు చెందిన దివంగత కే. బాలాజీ కుటుంబానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మద్నూరు శాఖ తరఫున రూ. 40 లక్షల ప్రమాద బీమా పరిహారాన్ని అందజేశారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో కే. బాలాజీ మృతి చెందడంతో ఆయన కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఈ కష్ట సమయంలో బ్యాంకు ద్వారా మంజూరైన ప్రమాద బీమా మొత్తం కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవనుంది.

రూ. 2 వేల ప్రీమియంతో రూ. 40 లక్షల బీమా

వివరాల్లోకి వెళితే.. కే. బాలాజీ బ్యాంకు ద్వారా రూ. 2,000 ప్రీమియం చెల్లించి ప్రమాద బీమా పాలసీ తీసుకున్నారు. అయితే, ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన దురదృష్టవశాత్తు మృతి చెందారు. దీంతో కుటుంబ సభ్యులు బీమా క్లెయిమ్‌కు సంబంధించిన అవసరమైన పత్రాలను బ్యాంకు అధికారులకు సమర్పించారు.

కుటుంబ సభ్యులు అందించిన పత్రాలను పరిశీలించిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు బీమా క్లెయిమ్‌ను మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో మద్నూరు ఎస్‌బీఐ శాఖ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో బాలాజీ భార్య, నామినీ శ్రీమతి కే. దీపాలి గారికి రూ. 40 లక్షల ప్రమాద బీమా పరిహారాన్ని బ్యాంకు ప్రతినిధులు అధికారికంగా అందజేశారు.



ప్రమాద బీమాతో కుటుంబానికి భరోసా

ఈ సందర్భంగా ఎస్‌బీఐ మద్నూరు శాఖ మేనేజర్ కే. అశోక్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ కుటుంబ భవిష్యత్తు భద్రతను దృష్టిలో ఉంచుకుని బ్యాంకులు అందించే ప్రమాద బీమా పథకాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. తక్కువ ప్రీమియంతో బీమా రక్షణ పొందడం ద్వారా అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు.కుటుంబ పెద్దను కోల్పోయిన సమయంలో బీమా పరిహారం ఆ కుటుంబానికి ఆర్థికంగా కొంత ఊరటనిస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ అవసరాలకు అనుగుణంగా బీమా పథకాల వివరాలను తెలుసుకుని, కుటుంబ భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.అకాల మరణం చెందిన బాలాజీ కుటుంబానికి రూ. 40 లక్షల బీమా పరిహారం అందడం స్థానికంగా ప్రాధాన్యత సంతరించుకుంది. భవిష్యత్తులో ఇలాంటి ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొనే పరిస్థితుల్లో బీమా పథకాలు కుటుంబాలకు అండగా నిలుస్తాయని ఈ ఘటన మరోసారి గుర్తుచేస్తోంది అని తెలిపారు.

భద్రతా ఆవిష్కరణ పురస్కారం 2026 అందుకున్న ఎన్టీపీసీ తెలంగాణ

జ్యోతినగర్, ఎన్టీపీసీ అక్టోబర్ 23 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : ఎన్టీపీసీ తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టుకు భద్రతా రంగంలో విశేష కృషికి గుర్తింపుగా భద్రతా ఆవిష్కరణ పురస్కారం--2026 లభించింది. న్యూఢిల్లీలోని లోధి రోడ్డులో ఉన్న ఇండియా హ్యాబిటాట్ సెంటర్‌లో అక్టోబర్ 23న ఇంజినీర్స్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇండియా--ఎస్‌క్యూఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 23వ అంతర్జాతీయ భద్రతా సదస్సులో ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఎన్టీపీసీ తెలంగాణ తరఫున అదనపు జనరల్ మేనేజర్ (ఈఎండీ) రజనీష్ చంద్ర సన్యాల్, సీనియర్ మేనేజర్ (భద్రత) ఏ.వి.ఎన్. రెడ్డి ఈ పురస్కారాన్ని అందుకున్నారు.విద్యుత్ ఉత్పత్తి కార్యకలాపాల్లో భద్రతకు అత్యంత ప్రాధాన్యమివ్వడం, వినూత్న భద్రతా విధానాలను అమలు చేయడం, ఉద్యోగుల్లో భద్రతపై అవగాహన పెంపొందించడం వంటి చర్యలకు ఈ పురస్కారం గుర్తింపుగా నిలిచింది. సురక్షితమైన పని వాతావరణాన్ని కల్పించేందుకు ప్రాజెక్టు బృందం సమష్టిగా చేస్తున్న కృషికి ఈ



అవార్డు నిదర్శనంగా నిలిచింది.ఈ గుర్తింపుతో ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు ప్రతిష్ఠ మరింత పెరిగిందని, "భద్రతే ప్రథమ ప్రాధాన్యం.. ఎల్లప్పుడూ, అన్నిచోట్లా" అనే నిబద్ధతతో ముందుకు సాగేందుకు ఈ పురస్కారం ప్రేరణనిస్తుందని సంస్థ వర్గాలు పేర్కొన్నాయి.

తొలితరం క్రికెటర్ జాలి ప్రతాప్ ఇకలేరు..

- **ఆయన లోటు పూడ్చలేనిది**



జ్యోతి నగర్ ఎన్టిపిసి అక్టోబర్ 23 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో తొలితరం క్రికెటర్ సింగరేణి మాజీ ఉద్యోగి జాలి ప్రతాప్ అనారోగ్యంతో హైదరాబాదులోని కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం తుది శ్వాస విడిచారు. ఆయన పార్థివదేహాన్ని గోదావరిఖని లోని తన ఇంటి వద్ద భద్రపరిచారు. ఆయన కుమారుడు అమెరికా నుండి శనివారం గోదావరిఖని చేరుకుంటాడు, అదేరోజు అంత్యక్రియలు నిర్వహిస్తారు. క్రికెటర్ గా, డాన్సర్ గా గోదావరిఖని ప్రజలకు సుపరిచితుడు. 1980 దశకంలో గోదావరిఖని ప్రభుత్వ పాఠశాలలో ఆయన ఎనిమిదో తరగతి నుంచి ఇంటర్ వరకు పూర్తి చేశారు. అదే టైంలో గోదావరిఖని జవహర్లాల్ స్టేడియంలో మంచి క్రికెటర్ గా రాణించారు. గోదావరిఖని బ్లూస్ జట్టులో ఆయన ప్రధాన ఆటగాడు. సింగరేణి అధికారి కొడుకు అయిన ప్రతాప్ మంచి పేరు తెచ్చుకున్నారు. అనంతరం ఆయనకు సింగరేణిలో క్లర్క్ గా ఉద్యోగు లభించింది. రామగుండం నగర మాజీ మేయర్ జాలి రాజమణి క సొంత అన్నయ్య ప్రతాప్. ఆయన మృతి తీరని లోటు అని ఏఐటియూసి రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కే స్వామి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుమ్మడి కుమారు స్వామి, టీబీజీకేఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామమూర్తి, సింగరేణి ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ సలహాదారు పులిమోహన్, గోదావరి బ్లస్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, కోచ్ డి.కిరణ్ కుమార్, ఐ ఎన్ టి యు సి, ఎన్ టి పి సి ఉద్యోగ సంఘం మాజీ నాయకుడు ముక్క సుదర్శన్, ప్రజానాట్యమండలి జాతీయ ఉపాధ్యక్షుడు కన్నం లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి పలువురు క్రికెటర్లు సింగరేణి ఉద్యోగులు హనుమాన్ నగర్ చౌరస్తా ఏరియా శ్రేయోభిలాషులు సంతాపం ప్రకటించారు.

కాంట్రాక్టు కార్మికులతో ఆత్మీయ అనుబంధం..
ఎం.డి. జిలానీకి ఘన సన్మానం



జ్యోతినగర్, ఎన్టీపీసీ అక్టోబర్ 23 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్:ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులో ఈ నెలలో ఉద్యోగ విరమణ చేయనున్న ఆపరేషన్ విభాగం ఉద్యోగి ఎం.డి. జిలానీని యూనిట్ 4, 5 ఆపరేషన్ విభాగాల కాంట్రాక్టు కార్మికులు ఘనంగా సన్మానించి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు.ఎన్టీపీసీలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 50 మంది కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు. 2014 నుంచి గత 12 ఏళ్లుగా యూనిట్ 5లో వర్క్‌మెన్ కేటగిరీలో విధులు నిర్వహిస్తున్న జిలానీ, అంకితభావంతో, క్రమశిక్షణతో పనిచేస్తూ మంచి గుర్తింపు పొందారని కార్మికులు పేర్కొన్నారు. ఎన్టీపీసీ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ కాంట్రాక్టు కార్మికులతో ఆత్మీయంగా కలిసిమెలిసి ఉండేవారని, విభాగంలోని ఉద్యోగులు, కార్మికులందరితో మంచి సంబంధాలు కొనసాగిస్తూ అందరి అభిమానాన్ని చూరగొన్నారని కొనియాడారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్. బిక్షపతి, రామగుండం ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గిట్ల లక్ష్మారెడ్డి తదితరులు జిలానీని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.యూనియన్ నాయకులు తోట రవీందర్, బొల్లం అశోక్, అక్క శంకర్, జి. నాగభూషణంతో పాటు కార్మికులు గన్ని రాజయ్య, మేకల లింగయ్య, బి. మల్లేష్, ఈ. వెంకటరత్నం, కృష్ణమూర్తి, మైబు అలీ, పురుషోత్తం, హరీష్, నాగార్జున, బక్క రెడ్డి, ఆనందు, వంశీ, కె. శంకర్, పి. మల్లేష్, తిరుమల్, ఎం. పవన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవం..
సిబ్బందికి వ్యాసరచన పోటీలు



జ్యోతినగర్, ఎన్టీపీసీ అక్టోబర్ 23 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ :

పోలీసు అమర వీరుల సంస్మ రణ వారో త్సవాన్ని పురస్కరించుకుని రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బందికి శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, అడిషనల్ డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్ పర్యవేక్షణలో, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ గోపి ఆధ్వర్యంలో కమిషనరేట్ కార్యాలయంలో ఈ పోటీలు జరిగాయి.పోలీసు సిబ్బందిలో వృత్తిపరమైన నైపుణ్యాన్ని పెంపొందించడం, సామాజిక బాధ్యతను గుర్తుచేయడం, ప్రజాసేవ పట్ల నిబద్ధతను పెంచడంతో పాటు ప్రజానుకూల పోలీసింగ్‌పై అవగాహన కల్పించడమే పోటీల ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు.పోటీలను రెండు విభాగాలుగా నిర్వహించారు. కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ హోదా వరకు సివిల్, ఆర్మ్డ్ రిజర్వ్ సిబ్బందికి ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు పోలీసుల నుంచి ఆశించే సేవలు, పోలీసు అధికారుల జీవితాల్లో సామాజిక మాధ్యమాల పాత్ర, వాటిని వ్యక్తిగత, సామాజిక ప్రయోజనాలకు సద్వినియోగం చేసుకునే అంశాలపై వ్యాసరచనకు అవకాశం కల్పించారు.ఎస్ఐ, ఆర్ఎస్ఐ, ఆపై హోదాల అధికారులకు ప్రజల నుంచి గౌరవం, ఆదరణ, సద్భావన పొందేందుకు పోలీసులు చేపట్టాల్సిన చర్యలు, క్షేత్రస్థాయిలో పోలీసింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసే మార్గాలపై అంశాలను కేటాయించారు. పాల్గొన్న సిబ్బంది తెలుగు లేదా ఆంగ్ల భాషలో వ్యాసాలు రాసే అవకాశం కల్పించారు.ఇలాంటి కార్యక్రమాలు పోలీసు సిబ్బందిలో ప్రజానుకూల దృక్పథం, జవాబుదారీతనం, వృత్తిపరమైన నిబద్ధతను పెంపొందించడంతో పాటు ప్రజల పట్ల బాధ్యతలను గుర్తుచేసి, సమర్థవంతమైన పోలీసింగ్‌కు దోహదపడతాయని అధికారులు పేర్కొన్నారు.

మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే క్యాంపు

కార్యాలయంలో దసరా అలాయ్ బలాయ్ వేడుకలు

- **మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే, యువ నాయకుడు హరీష్ షిండేలను మర్యాదపూర్వకంగా కలిసిన ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు**



ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.

జుక్కల్ / అక్టోబర్ 23 (అక్షరం న్యూస్ -- కామారెడ్డి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే దసరా అలాయ్ బలాయ్ వేడుకలు మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే క్యాంపు కార్యాలయంలో ఆత్మీయంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జుక్కల్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచులు, క్రియాశీలక నాయకులు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండేను, ఆయన కుమారుడు, యువ నాయకుడు హరీష్ షిండేను మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ సంప్రదాయం ప్రకారం అలాయ్ బలాయ్ నిర్వహించి, వారికి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.

సోదరభావానికి ప్రతీక అలాయ్ బలాయ్

దసరా పండుగ సందర్భంగా నిర్వహించే అలాయ్ బలాయ్ కార్యక్రమం ప్రజల మధ్య సోదరభావం, ఆత్మీయత, ఐక్యతను పెంపొందించే గొప్ప సంప్రదాయమని నాయకులు పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా పరస్పరం కలుసుకుని పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకోవడం తెలంగాణ సంస్కృతిలో ప్రత్యేకతగా నిలుస్తుందని తెలిపారు. ఈ వేడుకలు ప్రజల మధ్య స్నేహసంబంధాలను మరింత బలోపేతం చేస్తాయని అభిప్రాయపడ్డారు.

తెలంగాణ సంప్రదాయాల పరిరక్షణకు ప్రాధాన్యం

తెలంగాణ పండుగలు, సంప్రదాయాలు ప్రజల మధ్య ఐక్యతను పెంపొందిస్తాయని, అలాయ్ బలాయ్ వంటి కార్యక్రమాలు మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెబుతాయని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే, యువ నాయకుడు హరీష్ షిండేలకు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.

నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి హాజరు

ఈ కార్యక్రమంలో మద్నూర్, డోంగ్లీ, జుక్కల్, బిచ్కుంద, పెద్ద కొడపగల్, పిట్లం, నిజాంసాగర్ మండలాలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దసరా అలాయ్ బలాయ్ వేడుకలు ఆత్మీయ వాతావరణంలో కొనసాగాయి.

పాఠశాలలు అంగన్‌వాడీల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు





- **విద్యార్థులకు నాణ్యమైన విద్య.. ఖీచిన్నారులకు పౌష్టికాహారం అందించాలి..**
- **భూ రీ సర్వే పారదర్శకంగా నిర్వహించాలి..**
- **కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్..**

హనుమకొండ జిల్లా / భీమదేవరపల్లి/ అక్టోబర్ 23/అక్షరం న్యూస్:- హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రత్నగిరి గ్రామంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ పర్యటించి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యాబోధన విద్యార్థుల అభ్యసన సామర్థ్యం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం ఇతర సేవలను పరిశీలించారు. ఈ భాగంగా రత్నగిరి గ్రామంలో చేపడుతున్న భూ రీ సర్వే వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్వే ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. భూ సర్వేను పారదర్శకంగా నిర్వహిస్తూ భూ యజమానుల మధ్య ఎలాంటి వివాదాలు తలెత్తకుండా సంబంధిత అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సర్వే వివరాలపై రైతులకు స్పష్టత కల్పిస్తూ. వారి అభ్యంతరాలు ఉంటే నిబంధనల ప్రకారం పరిశీలించాలని సూచించారు. అలాగేప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల హాజరు బోధనా పద్ధతులు అభ్యసన సామర్థ్యాన్ని కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థులు మెరుగైన విద్యా ప్రమాణాలు సాధించేలా బోధన సాగించాలని పేర్కొన్నారు. అలాగేఅంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం గర్భిణులు, బాలింతలకు కల్పిస్తున్న సేవలను కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పౌష్టికాహారం అందించాలని కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్యం ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ప్రజలకు అందించే సేవల్లో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో నయాబ్ తహసీల్దార్ సూర్య, స్థానిక సర్పంచ్ వంగ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లలో వేగం పెంచాలి...
ఆదాయం పెంచండి



జ్యోతినగర్, ఎన్టీపీసీ అక్టోబర్ 23 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : నగర పాలక సంస్థ ఆదాయాన్ని పెంచేందుకు లక్ష్యం మేరకు పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ అన్నారు. శుక్రవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో వార్డు అధికారులు, సహాయకులు, రెవెన్యూ విభాగం సిబ్బందితో పన్ను వసూళ్ల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పన్నులు, నల్లా బిల్లులు, లైసెన్స్ ఫీజులను లక్ష్యం మేరకు వసూలు చేయాలని సూచించారు. అనుమతులు లేని కట్టడాలకు వంద శాతం జరిమానా విధించాలని ఆదేశించారు. నివాస గృహాల నిర్మాణానికి అనుమతి పొంది, అనంతరం వాటిని వాణిజ్య భవనాలుగా మార్చిన వారికి నోటీసులు జారీ చేయాలని అన్నారు. దీర్ఘకాలంగా పన్ను బకాయిలు చెల్లించని వారికి రెడ్ నోటీసులు జారీ చేయడంతోపాటు చట్టప్రకారం తదుపరి చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.ఇళ్లు, భవనాల వివరాలను సేకరించి జియోట్యాగింగ్ చేసేందుకు నిర్వహిస్తున్న భువన్ సర్వేను శనివారం నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి, కార్యదర్శి మహేశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఖాజా, జూనియర్ అసిస్టెంట్ (రెవెన్యూ) సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా సహకార సంఘం

- **పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం.. క్వింటాలుకు రూ.9,210 చెల్లింపు..**



హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/ అక్టోబరు 23/అక్షరం న్యూస్:- రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా ముల్కనూర్ సహకార సంఘం ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లు సంఘ అధ్యక్షుడు అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని శుక్రవారం ముల్కనూర్ సహకార గ్రామీణ పరపతి మార్కెట్ సంఘం పారాబాయిల్డ్ రైస్ మిల్లు ఆవరణలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా సహకార అధికారి బి.మోహన్, సంఘ అధ్యక్షుడు అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, సంఘ జనరల్ మేనేజర్ ఎం.రాంరెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులు పండించిన పత్తిని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి విక్రయించుకోవాలని సూచించారు. మార్కెట్‌లో పత్తి ధర క్వింటాలుకు రూ.9,010 ఉండగా సహకార సంఘం తరఫున అదనంగా రూ.200 కలిపి మొత్తం రూ.9,210 చొప్పున కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో సహకార సంఘం ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో సంఘ కార్యవర్గ సభ్యులు, మిల్లు మేనేజర్ అభిలాష్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు

10వ వార్డులో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు

- మున్సిపాలిటీ చైర్మన్ ములుగు ప్రశాంత్ కుమార్ దిలీప్



కరీంనగర్/జమ్మికుంట/అక్టోబర్ 23/అక్షరం న్యూస్: పట్టణంలోని 10వ వార్డులో నెలకొన్న డ్రైనేజీ సమస్యను సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ తెలిపారు. 10వ వార్డు కౌన్సిలర్ తూర్పాటి చందన శంకర్ ఆహ్వానం మేరకు వార్డును సందర్శించిన చైర్మన్, మున్సిపల్ ఏఈ వికాస్, టీపీపీఓ దీపికతో కలిసి డ్రైనేజీ సమస్య ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. సమస్య తీవ్రతను అధికారులకు వివరించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఓటు హక్కుల పరిరక్షణకు రైతులు, కూలీలు ఏకం కావాలి

- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలి



జ్యోతినగర్, ఎన్టీపీసీ అక్టోబర్ 23 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : ఓటర్ల జాబితాలో అక్రమాలను నిరసిస్తూ, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రైతులు, కూలీలు, సామాన్య ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) పెద్దపల్లి జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా శుక్రవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కళ్లకు నల్లగుడ్డలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు గుండేటి మల్లేశం, ఉపాధ్యక్షుడు మేరుగు చంద్రయ్య మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే పదవి నుంచి తొలగించి, ఆయనపై విచారణ జరపాలని కోరారు. పారదర్శకత లేకుండా ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 13.41 కోట్ల మంది పౌరుల ఓటు హక్కులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకాలకు సంబంధించిన 2023 చట్టాన్ని సవరించి, నియామక ఎంపిక కమిటీలో కేంద్ర మంత్రికి బదులుగా భారత ప్రధాన న్యాయమూర్తికి స్థానం కల్పించాలని కోరారు. ఎన్నికల కమిషనర్లకు చట్టపరమైన రక్షణ కల్పించే సెక్షన్ 16ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో నిరసనకారులు, ముఖ్యంగా విద్యార్థినులు, యువతపై జరుగుతున్న దాడులు, హింసను ఖండించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడేందుకు ప్రజలంతా ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు కె.లింగమూర్తి, బోనాల లింగయ్య, ఎం.డి.బాబా, తిర్రి బాలకృష్ణ, తూల్ల గట్టయ్య, ఎల్.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కార్యక్రమాలు



జనగామ జిల్లా/ రఘునాథపల్లి/(అక్షరం న్యూస్)అక్టోబరు 23:

మండలంలోని వెల్ది మోడల్ స్కూల్కు చెందిన ఇంటర్ విద్యార్థులకు పది రోజుల పాటు దసరా ఇంటర్న్‌షిప్ కార్యక్రమాలు నిర్వహించినట్లు వెల్ది మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పాలకుర్తి శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ విభాగాల విద్యార్థులు ఆయా రంగాలకు సంబంధించిన ప్రయోగిక పరిజ్ఞానంతో పాటు క్షేత్ర స్థాయి అనుభవం కోసం జనగామలోని స్వామి ఫిట్నెస్ సెంటర్ ను సందర్శించారని, బాడీని ఎలా బిల్డ్ చేసుకోవాలో, డైట్ ఏవిదంగా చేయాలో ఫిట్నెస్ సెంటర్ నిర్వాహక లు విద్యార్థులకు నేర్పించారని అన్నారు. అలాగే స్వయం ఉపాధి అవకాశాలు తెలుసుకునేందుకు మీడియా అండ్ ఎం టర్టైన్మెంట్ విభాగం విద్యార్థులు మండల కేంద్రంలోని ప్రదీప్ ఫోటో స్టూడియోను సందర్శించి ఫోటోగ్రఫీ, కెమెరా వి నియోగం, ఫోటో ఎడిటింగ్, డిజిటల్ మీడియా సాంకేతికతలు. స్టూడియో నిర్వహణ తదితర అంశాల గురించి తెలుసుక న్నారని తెలిపారు. విద్యార్థులతో పాటు వృత్తి విద్యా వ్యాయమ ఉపాధ్యాయుడు వెనిల్ కుమార్, మీడియా అండ్ ఎంటర్టైన్మెంట్ ఉపాధ్యాయురాలు రేణుక పాల్గొన్నారని వెల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీధర్ తెలిపారు.

విషాదంలోనూ మానవత్వం.. నలుగురి

జీవితాల్లో వెలుగులు నింపిన రెండు కుటుంబాలు



- గుండెపోటు, రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి.. నేత్రదానంతో మరో నలుగురికి చూపునిచ్చే అవకాశం

జ్యోతినగర్, ఎన్టీపీసీ అక్టోబర్ 23 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : కన్నకొడుకులను కోల్పోయిన పుట్టెడు దుఃఖంలోనూ ఆ రెండు కుటుంబాలు మానవత్వాన్ని చాటుకున్నాయి. తమ కుమారుల నేత్రాలను దానం చేసి మరో నలుగురి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ముందుకొచ్చాయి. పెద్దపల్లి జిల్లా యైటింక్లైన్ కాలనీకి చెందిన దుంపేటి ఉదయ్ (34) గుండెపోటుతో, రామగిరి మండలం బేగంపేటకు చెందిన ముత్తె అరవింద్ కల్యాణ్ (32) రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోగా.. వారి కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరించి ఆదర్శంగా నిలిచారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న ఉదయ్.. అనారోగ్యంతో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. యైటింక్లైన్ కాలనీలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కమలమనోహర్, మంజుల దంపతులకు ఆయన కుమారుడు. ఉదయ్‌కు భార్య మేఘన, ఏడాది వయసున్న కుమార్తె ఉన్నారు. మరోవైపు బేగంపేటకు చెందిన అరవింద్ కల్యాణ్ ఈ నెల 22న హన్మకొండలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.

దుఃఖంలోనూ గొప్ప నిర్ణయం

ఇద్దరు యువకుల మరణంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. అయినప్పటికీ తమ కుమారుల నేత్రాలను దానం చేసేందుకు అంగీకరించి మానవత్వాన్ని చాటారు. ఉదయ్ కుటుంబ సభ్యులకు సింగరేణి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత



నేత్రదానంపై అవగాహన కల్పించగా, అరవింద్ కల్యాణ్ కుటుంబ సభ్యులకు ఆయన సమీప బంధువు లగిశెట్టి రాజకిశోర్ నేత్రదానం ప్రాధాన్యాన్ని వివరించారు. దీంతో రెండు కుటుంబాలు సానుకూలంగా స్పందించాయి. సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య సంస్థకు చెందిన సాంకేతిక నిపుణుల సహకారంతో ఉదయ్, అరవింద్ కల్యాణ్ నేత్రాలను సేకరించి హైదరాబాద్‌లోని ఐ బ్యాంకుకు తరలించారు. ఈ నేత్రదానం ద్వారా నలుగురు అంధులకు చూపు కల్పించే అవకాశం లభించింది.

కుటుంబాలకు అభినందనలు

ఉదయ్ పార్థివదేహాన్ని 15వ డివిజన్ కార్పొరేటర్ శంకర్ నాయక్, సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత, కరస్పాండెంట్ ఎన్. వేణుగోపాల్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి, నేత్రదానానికి అంగీకరించిన వారి నిర్ణయాన్ని అభినందించారు. అరవింద్ కల్యాణ్ కుటుంబ సభ్యులను బంధుమిత్రులు, సదాశయ ఫౌండేషన్



ప్రతినిధులు పరామర్శించి సానుభూతి తెలిపారు. తల్లిదండ్రులు ముత్తె కళ్యాణి, చంద్రమౌళి, సోదరుడు ముత్తె సుమన్ నేత్రదానానికి అంగీకరించడాన్ని అభినందించారు. నేత్రదానంపై కుటుంబానికి అవగాహన కల్పించిన లగిశెట్టి రాజకిశోర్‌ను ప్రశంసించారు. తమ బిడ్డలు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయినా.. వారి కళ్ల ద్వారా మరికొందరు ఈ ప్రపంచాన్ని చూసే అవకాశం కల్పించిన ఆ రెండు కుటుంబాల ఔదార్యం పలువురికి స్ఫూర్తిగా నిలిచింది.

డాక్టర్ లోకేష్ యాదవ్ కి గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి..

- కల్పించాలి జాతీయ బీసీ సంక్షేమ సంఘం
- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారి,



ఖమ్మం/ వైరా అక్టోబర్ 23 (అక్షరం న్యూస్)

రాజకీయంగా బీసీలకు సముచిత స్థానాలు కల్పించాలి జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారి,

ఈరోజు తనను మర్యాదపూర్వకంగా కలవడానికి తన ఆఫీసుకి వచ్చినటువంటి , టి పి సి సి అధికార ప్రతినిధి,డాక్టర్ లోకేష్ యాదవ్ ని శాలువాతో సత్కరించి ఆయనతో బీసీ సంఘాల గురించి ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయాల గురించి సుదీర్ఘంగా చర్చించారు, ఈ సందర్భంగా

మోడేపల్లి కృష్ణమాచారి మాట్లాడుతూ..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 60 శాతం ఉన్న బీసీలను అన్ని రాజకీయ పార్టీలు కేవలం జండాలు మోసి జేజేలు కొట్టి ఓట్లు వేసే యంత్రాలు గానే చూస్తున్నారు కానీ రాజకీయంగా అవకాశాలు కల్పించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తూ... ఖమ్మం జిల్లాలో తెలంగాణ రాష్ట్ర ఏర్పడ్డాక కాంగ్రెస్ పార్టీలో చట్టసభలలో అసలు ప్రాతినిధ్యమైన లేకపోవడం బీసీలను అవమానపరచడమే సుదీర్ఘంగా కాంగ్రెస్ పార్టీనీ నమ్ముకుని పనిచేసే డాక్టర్ లోకేష్ యాదవ్ లాంటి వాళ్లకు కూడా అవకాశం ఇవ్వకపోవడం చాలా బాధాకరమని, ఇకనైనా అన్ని రాజకీయ పార్టీలు బీసీలను గుర్తించాలని లేనిపక్షంలో రాజకీయ పార్టీలకు తగిన గుణపాఠం చెబుదామని ఆయన తెలియజేశారు, ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు వాకదాని శ్రీనివాస్, బట్టు వంశీ, వాకదాని వినయ్, వడ్డెపూడి సైదులు, రుద్రాక్షి మహేష్ తదితరులు పాల్గొన్నారు

ఆపదలో ఉన్నవారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులతో అండగా నిలుస్తున్నాం

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్



కరీంనగర్/హుజురాబాద్/అక్టోబర్ 23/అక్షరం న్యూస్: ఆపదలో ఉన్న నిరుపేదలను ఆదుకుంటూ, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు చేరవేస్తున్నామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. శుక్రవారం హుజురాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో హుజురాబాద్ పట్టణం, మండలంతో పాటు కమలాపూర్, వీణవంక, ఇల్లందకుంట మండలాలకు చెందిన లబ్ధిదారులకు రూ.53 లక్షల విలువైన 153 ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తోందని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, రైతు భరోసా, రుణమాఫీ, సన్నవడ్లకు బోనస్ వంటి పథకాలతో ప్రజలకు మేలు చేస్తున్నామని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేయడం తప్ప ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిందేమీ లేదని విమర్శించారు. ప్రభుత్వం అందించే సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో ముఖ్యమంత్రి ఫొటో లేకుండా ఇవ్వడం కౌశిక్ రెడ్డి అవివేకానికి నిదర్శనమని ప్రణవ్ వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాళ్లు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్లు, డైరెక్టర్లు, దేవాలయ కమిటీ ప్రతినిధులు, గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, బ్లాక్ కాంగ్రెస్, సేవాదళ్, యువజన, యూత్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విభాగాల నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కంచనపల్లి కాలువ ద్వారా చెరువులు నింపేందుకు చర్యలు తీసుకోవాలి



జనగామ జిల్లా/రఘునాథపల్లి/(అక్షరం న్యూస్)అక్టోబరు 23: కంచనపల్లి కాలువ ద్వారా చెరువులు నింపేందుకు చర్యలు తీసుకొని, రైతులకు సాగు నీరు, ప్రజలకు తాగు నీటి ఇబ్బందులు కలుగకుండా చూస్తామని జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చం దర్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాల మేరకు ఇప్పగూడెం నుంచి స్టేషన్ ఘనాపూర్ రిజర్వాయర్ ఎడమ కాలువ ద్వారా కంచనపల్లికి వచ్చే కాలువను లింగాల జగదీష్ చందర్ రెడ్డితో పాటు నీటిపారుదల శాఖ అధికారులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా జగదీష్ చందర్ రెడ్డి మాట్లాడుతూ కంచనపల్లికి వచ్చే ఎడమ కాలువ ద్వారా రామన్నగూడెం. కోడూరు, గబ్బెట గ్రామాలకు గోదావరి జలాలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కంచనపల్లి కాలువకు గేటు ద్వారా నీటిని విడుదల చేసి ఆయా గ్రామాల్లోని చెరువులను నింపేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో చెరువులు నింపితే రైతులకు సాగు నీటి భరోసా కల్పించినట్లవుతుందని, కాలువ ద్వారా నీటిని విడ దల చేసే ప్రక్రియను వేగవంతం చేసి సాగు నీరు అందేలా చర్యలు తీసుకునేటట్లు సంబందిత అధికారులతో చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఈఈ ప్రవీణ్. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె మహేందర్ రెడ్డి, లోనే రవిందర్, కొలిపాక మల్లేష్, వల్లాల పురుషోత్తం, కంచనపల్లి, గబ్బెట, కోడూరు. రామన్నగూడెం సర్పంచ్లు గొంగళ్ల అబ్రహాం. ఉపేంద్ర, అలివేలు,లలిత తదితరులు పాల్గొన్నారు

అన్నదాతను నిండా ముంచిన బయో మందులు

- **న్యాయం చేయండి. లేదంటే ఆత్మహత్యే గతి**
- **ప్రెస్‌క్లబ్ వేదికగా అన్నదాత రాజయ్య ఆక్రందన**



పెద్దపల్లి టౌన్ అక్టోబర్ 23 అక్షరం న్యూస్

బయో పురుగు మందుల పిచికారీ వికటించి చేతి కొచ్చిన పత్తి పంట సమూలం గా నాశన మైందని, వ్యవసాయ అధి కారులు స్పందించి తనకు నష్ట పరి హారం ఇప్పిం చ ేకపోతే ఆత్మ హత్యే శరణ్యమని పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం బాల రాజుపల్లి గ్రామానికి చెందిన రైతు కుంటూరి రాజయ్య తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.శుక్రవారం పెద్దపల్లి కమాన్ రోడ్డులోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడిన ఆయన,తన 2 ఎకరాల 20 గుంటల విస్తీర్ణంలో సుమారు రూ. 2.50 లక్షల మేర అప్పులు చేసి పత్తి సాగు చేయగా, పంటలో దోమ నివారణ కోసం జూలపల్లిలోని శ్రీ రామాంజనేయ పెస్టిసైడ్స్ దుకాణంలో అక్టోబర్ 4న కొనుగోలు చేసిన ఎస్కే రెడ్డి కంపెనీకి చెందిన ప్రెసిడెంట్,వజ్రం బయో మందులను కొనుగోలు చేసి, దుకాణదారు సూచనల మేరకు కలిపి పిచికారీ చేయడంతో చేను మొత్తం ఎర్రబారి మాడిపోయిందని కన్నీటి పర్యంతమయ్యారు. దాదాపు రూ. 4 లక్షల వరకు దిగుబడి ఆశించిన తనకు అపార నష్టం వాటిల్లిందని,ఈ విషయమై ప్రశ్నిస్తే అటు డీలర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు కంపెనీ ప్రతినిధులు మొదట న్యాయం చేస్తామని చెప్పి ప్రస్తుతం ఫోన్లు కూడా ఎత్తడం లేదని వాపోయారు.ఇప్పటికే జిల్లా వ్యవసాయ అధికారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశానని రైతు తెలిపారు.అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని నమోదు చేయాలని,సదరు బయో పెస్టిసైడ్స్ నాణ్యత,బ్యాచ్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి తనకు పరిహారం అందేలా చూడటంతో పాటు సంబంధిత కంపెనీ,డీలర్‌పై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని రైతు కుంటూరి రాజయ్య డిమాండ్ చేశారు1

హిందీ అధికార భాష అమలుపై సమష్టి కృషి చేయాలి





- **నగర రాజభాష అమలు కమిటీ సమావేశంలో ఎన్టీపీసీ రామగుండం, తెలంగాణ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫైజ్ తయ్యబ్**

జ్యోతినగర్, ఎన్టీపీసీ అక్టోబర్ 23 పెద్దపల్లి జిల్లా అక్షర న్యూస్

హిందీ అధికార భాష అమలులో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు సభ్య కార్యాలయాలన్నీ సమష్టిగా కృషి చేయాలని ఎన్టీపీసీ రామగుండం, తెలంగాణ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫైజ్ తయ్యబ్ సూచించారు. శుక్రవారం ఎన్టీపీసీ రామగుండం పరిపాలనా భవనం మొదటి అంతస్తులోని సమావేశ మందిరంలో 2026 సంవత్సరానికి సంబంధించిన నగర రాజభాష అమలు కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి కేంద్ర విద్యాలయం, ఆదాయపు పన్నుల శాఖ, భారతీయ స్టేట్ బ్యాంక్, కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం, హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్, భారతీయ జీవిత బీమా సంస్థ, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్, కెనరా బ్యాంకులకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. తొలుత కమిటీ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ఫైజ్ తయ్యబ్‌ను సభ్య కార్యాలయాల ప్రతినిధులకు పరిచయం చేశారు. అనంతరం సభ్య కార్యదర్శి అధ్యక్షుడితో పాటు ప్రతినిధులకు స్వాగతం పలికారు.ఎన్టీపీసీ మానవ వనరుల విభాగాధిపతి సాగర్ రంజన్ సాహూ మాట్లాడుతూ, అధికార భాషా విభాగం నిబంధనల ప్రకారం నగర రాజభాష అమలు కమిటీ సమావేశాలను సంవత్సరానికి రెండుసార్లు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. తదుపరి సమావేశానికి సభ్య కార్యాలయాల అధిపతులు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఎన్టీపీసీ కేంద్ర కార్యాలయం అధికార భాషా విభాగాధిపతి అతర్ సింగ్ గౌతమ్ సభ్య కార్యాలయాల్లో హిందీ అమలు పురోగతిని సమీక్షించి పలు సూచనలు చేశారు. హిందీలో వచ్చిన ఉత్తరాలకు హిందీలోనే సమాధానాలు ఇవ్వాలని, త్రైమాసిక నివేదికలను ఆన్‌లైన్‌లో సమర్పించాలని, 'గ' ప్రాంతానికి నిర్దేశించిన 60 శాతం లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలని సూచించారు.హిందీ అమలులో ఉత్తమ పనితీరు కనబరిచినందుకు రామగుండం కేంద్రీయ విద్యాలయానికి సమావేశంలో షీల్డ్ అందజేసి పురస్కరించారు.అనంతరం అధ్యక్షుడు ఫైజ్ తయ్యబ్ మాట్లాడుతూ, సభ్య కార్యాలయాలు హిందీ అభివృద్ధి కోసం చేస్తున్న కృషిని అభినందించారు. అధికార భాష అమలులో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి రామగుండం ఎన్టీపీసీ అధికార భాషా అధికారిని సంప్రదించి సహాయం పొందవచ్చని తెలిపారు. ధన్యవాదాలతో సమావేశం ముగిసింది.

హుజూరాబాద్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ప్రతిష్ఠాపనకు రాజకీయ గ్రహణం!


- **ఇప్పటికే పలుమార్లు వాయిదా.. పద్మశాలి సంఘ నాయకుల మధ్య వర్గ విభేదాలే కారణమా?లి**
- **'లోకల్--నాన్ లోకల్' వివాదానికి ఆజ్యం పోస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్?**

కరీంనగర్/ హుజురాబాద్/ అక్టోబర్ 23/ అక్షరం న్యూస్:

పద్మశాలి సమాజ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం హుజూరాబాద్‌లో ఇప్పటికే పలుమార్లు వాయిదా పడటం చర్చనీయాంశంగా మారింది. విగ్రహ ప్రతిష్ఠాపన ఎప్పటికి పూర్తవుతుంది? ఈ కార్యక్రమానికి అడ్డంకులేమిటి? అన్న ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి.విగ్రహ ప్రతిష్ఠాపన చుట్టూ పద్మశాలి సంఘ నాయకుల మధ్య విభేదాలు, వర్గపోరు నెలకొన్నాయనే ప్రచారం సాగుతోంది. 'లోకల్--నాన్ లోకల్' అంటూ పరస్పర ఆరోపణలు చేసుకోవడం వివాదానికి మరింత ఆజ్యం పోస్తోందనే చర్చ జరుగుతోంది.

'లోకల్--నాన్ లోకల్' వివాదానికి ఆజ్యం.. మాజీ మున్సిపల్ చైర్మన్, ఫైనాన్షియర్ తీరుపై చర్చ!

హుజూరాబాద్‌లో 'లోకల్--నాన్ లోకల్' అంశాన్ని తెరపైకి తెస్తూ కొత్త వివాదాలకు ఆజ్యం పోస్తున్నారంటూ మాజీ మున్సిపల్ చైర్మన్, ఆయనకు సన్నిహితంగా ఉన్న ఓ ఫైనాన్షియర్‌పై స్థానికంగా చర్చ జరుగుతోంది. వేరే గ్రామం నుండి హుజూరాబాద్‌కు వచ్చిన ఓ బీఆర్ఎస్ నాయకుడు, వేరే గ్రామం నుండి హుజూరాబాద్‌కు వచ్చి స్థిరపడిన ఓ ఫైనాన్షియర్ పాత్రపై కూడా గుసగుసలు వినిపిస్తున్నాయి.మరోవైపు, ప్రజల ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకుని కోట్లాది రూపాయలు కూడబెట్టారనే ఆరోపణలు సదరు ఫైనాన్షియర్‌పై ప్రచారంలో ఉన్నాయి.''బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన వారే, ఇప్పుడు స్థానికులను 'నాన్ లోకల్' అంటూ విమర్శించడం ఎంతవరకు సమంజసం?'' అంటూ కొందరు స్థానికులు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో స్థానికత అంశంపై చర్చ మరింత వేడెక్కుతున్నట్లు తెలుస్తోంది.పద్మశాలి సమాజ ఐక్యతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన సమయంలో ఇలాంటి వివాదాలు తెరపైకి రావడం ఎందుకనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై సంబంధిత నాయకులు స్పందించి వాస్తవాలను స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది.



బాపూజీ ఆశయాల కంటే ఆధిపత్య పోరే ముఖ్యమా?

తాము ఏ ప్రాంతం నుంచి వచ్చారన్నది పక్కనపెట్టి, స్థానికత పేరుతో ఇతరులపై వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసం? అనే ప్రశ్నలు స్థానికంగా చర్చకు దారితీస్తున్నాయి. పద్మశాలి సమాజ ఐక్యతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన సమయంలో వ్యక్తిగత, రాజకీయ విభేదాలు ఎందుకు తెరపైకి వస్తున్నాయన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ప్రతిష్ఠాపన వంటి గౌరవప్రదమైన కార్యక్రమం పలుమార్లు వాయిదా పడటానికి అసలు కారణాలేమిటన్నది తేలాల్సి ఉంది. సమాజ ఐక్యతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన నాయకులు వ్యక్తిగత విభేదాలకు, రాజకీయ ఆధిపత్య పోరుకు తావిస్తున్నారా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. పద్మశాలి సమాజానికి గౌరవప్రదమైన గుర్తింపుగా నిలవాల్సిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం రాజకీయ వివాదాలకు కేంద్రంగా మారకుండా, సంఘ నాయకులందరూ ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.పలుమార్లు వాయిదా పడిన విగ్రహ ప్రతిష్ఠాపనకు మోక్షం ఎప్పుడు? వర్గ విభేదాలకు తెరపడేదెప్పుడు? బాపూజీ విగ్రహ ఆవిష్కరణకు అడ్డంకులు తొలగేదెప్పుడు? అన్నది ఇప్పుడు హుజూరాబాద్‌లో చర్చనీయాంశంగా మారింది.

బీజేపీ అధికార ప్రతినిధిగా పొన్నం శ్రీనివాస్ నియామకం



చిగురుమామిడి/అక్టోబర్ 23, అక్షరం న్యూస్, భారతీయ జనతా పార్టీ సిద్దిపేట జిల్లా అధికార ప్రతినిధిగా చిగురుమామిడి మండల కేంద్రానికి చెందిన పొన్నం శ్రీనివాస్ ను నియమిస్తూ బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్,మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు లు,తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన సిద్దిపేట జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ కు నియామకానికి సహకరించిన వారికి పొన్నం శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా పొన్నం శ్రీనివాస్ మాట్లాడుతు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తానని,పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేస్తూ కార్యకర్తలకు అండగా ఉంటానని పేర్కొన్నారు.పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు,ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.హుస్నాబాద్ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేసి,రాబోయే రోజుల్లో కాషాయ జెండా ఎగురవేయడమే తన లక్ష్యమని పొన్నం శ్రీనివాస్ స్పష్టం చేశారు.శ్రీనివాస్ నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ..





- **వైరా మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ**

ఖమ్మం/ వైరా టౌన్ అక్టోబర్ 23 (అక్షరం న్యూస్)

పచ్చదనం, పరిశుభ్రతతోనే ఆరోగ్యమైన సమాజం సాధ్యమని వైరా మున్సిపాలిటీ చైర్మన్ కాపా చంద్రకళ మురళీకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా కాపా చంద్రకళ మురళీకృష్ణ మాట్లాడుతూ.. ప్రస్తుతం మారుతున్న వాతావరణ పరిస్థితులను తట్టుకోవడానికి, భవితరాలకు స్వచ్ఛమైన గాలిని అందించడానికి మొక్కల పెంపకమే ఏకక మార్గమని ఆమె పిలుపునిచ్చారు. మొక్కల పట్ల శ్రద్ధ అల మార్చుకోవాలని సూచించారు.వైరా మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో వన మహోత్సవ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. వన మహోత్సవం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించడం, పర్యావరణ సమతుల్యతను కాపాడటం, కాలుష్యాన్ని తగ్గించడం సాధ్యమవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకట్రావు, వార్డు ప్రజలు దేవభక్తుని రవీంద్ర, లగడపాటి ప్రభాకరరావు ప్రభాకర్ రావు, తోటకూర శ్రీకాంత్, విజయలక్ష్మి, కల్పన, సుశీల, లక్ష్మీరాజ్యం, కృష్ణవేణి,సంధ్య, ఉప్పలమ్మ,ఆర్‌పీ ఫాతిమా, లక్ష్మణరావు,జవాన్ శ్రీను, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాందాస్ అగర్వాల్ జన్ సేవా సమ్మాన్ జాతీయ పుర స్కారానికి ఎంపికైన డాక్టర్ బాలు

లోక్ సభ స్పీకర్ ఓంబిర్లా చేతుల మీదుగా ఢిల్లీలో అం దుకోనున్న జాతీయ పురస్కారం.



కామారెడ్డి జిల్లా/ఎల్లారెడ్డి/అక్టోబర్ 23/అక్షరం న్యూస్:

కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన ఐవిఎఫ్ సేవాదళ్ రా ష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయ సభ్యులు డాక్టర్ బాలు దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన రాందాస్ అగ ర్వాల్ జన్ సేవా సమ్మాన్ జాతీయ పురస్కారం 2026 కు ఎంపికయ్యారు.ఈ అవార్డును ఈ నెల 31వ తేదీన ఢిల్లీలో నిర్వహించనున్న సమావేశంలో లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా చేతుల మీదుగా అందుకోనున్నారు.ఈ పుర స్కారానికి అవకాశం కల్పించిన ఐవిఎఫ్ అడ్వైజరీ బోర్డ్ చైర్మన్ గంజి రాజమౌళి గుప్త,ఐవిఎఫ్ జాతీయ సీనియ ర్ వర్కింగ్ ప్రెసిడెంట్,రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్త,ఐవిఎఫ్ జాతీయ అధ్యక్షులు అశోక్ అగర్వాల్ ల కు,ఐవిఎఫ్ తెలంగాణ విభాగానికి,19 సంవత్సరాలుగా సహకరిస్తున్న రక్తదాతలకు, శ్రేయోభిలాషులందరికీ కృ తజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ బాలు మా ట్లాడుతూ 2007లో రక్తదాన కార్యక్రమాలను కామారెడ్డి కేంద్రంగా ప్రారంభించి నేడు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నామని, వ్యక్తిగతంగా 8 4 సార్లు రక్తదానం,తల సేమియా బాధిత చిన్నారుల కో సం 6,000 యూనిట్లకు పైగా రక్తాన్ని సేకరించడం, 350 కి పైగా రక్తదాన శిబిరాలు నిర్వహించి 30 వేల యూనిట్ల రక్తాన్ని అందజేసినందుకు, రక్తదానం పైన అవగాహన కార్యక్రమాలు,సామాజిక సేవా కార్యక్రమాలు విజయవం తంగా నిర్వహించినందుకు గాను ఈ పురస్కారం అంద జేస్తున్నట్లు తెలిపారు.ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో తలసేమియా బాధిత చిన్నారుల కోసం మరిన్ని రక్తదాన శిబిరాలను నిర్వహించి వారి ప్రాణాలను కాపాడడం కో సం మరింత కృషి చేస్తానని అన్నారు.

మీ ప్రమాణం ఫేషియల్ అటెండెన్స్ తప్పనిసరి..

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.రామారావు,



ఖమ్మం/ స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 23 (అక్షరం న్యూస్)

మీ ప్రమాణం ఫేషియల్ అటెండెన్స్ తప్పనిసరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.రామారావు అన్నారు.ఖమ్మం జిల్లా కార్యాలయంలోని మీటింగ్ హాల్ లో ఆఫీస్ సిబ్బందితో మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మీ ప్రమాణం ఫేషియల్యా ప్ ప్రవేశపెట్టడం జరిగిందని,. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం మరియు కమిషనర్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, ఆదేశానుసారం, ప్రతి ఒక్కరూ మీ ప్రమాణం అటెండెన్స్ వేయాలని, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి రామారావు ఆదేశించడం జరిగింది.జిల్లా కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది తో మాట్లాడుతూ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పని చేసే సిబ్బంది, అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బంది, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది ప్రతి ఒక్కరూ 9 గంటలకు ఇన్, 4 గంటలకు సాయంత్రం అవుట్ అటెండెన్స్ ని మీ ప్రమాణం యాప్ లో వేయాలని పేర్కొనడం జరిగింది. అదేవిధంగా ఆఫీస్ సిబ్బంది ఉదయం 10:00 గంటలకు ఇన్ మరియు సాయంత్రం 5 గంటలకు మీ ప్రమాణం యాప్ లో అవుట్ అటెండెన్స్ వేయాలని ఆదేశించడం జరిగింది. ప్రతిరోజు డిప్యూటీ డి ఎం హెచ్ ఓ లు, ప్రోగ్రాం ఆఫీసర్స్,ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు కూడా అటెండెన్స్ వేస్తూ, సిబ్బంది యొక్క అటెండెన్స్ ని ప్రతిరోజు మానిటర్ చేయాలని కోరడం జరిగింది. మీ ప్రమాణంలో అటెండెన్స్ వేయలేని సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోబడతాయని ఆదేశించారు.

పోలియో రహిత సమాజమే మన లక్ష్యం...

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి. డాక్టర్ డి రామారావు



ఖమ్మం/ స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 23 (అక్షరం న్యూస్)

ప్రపంచ పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు మాట్లాడుతూ పోలియో వ్యాధి నివారణపై ప్రజలలో అవగాహన కల్పించాలని, పోలియోవైరస్ వలన వ్యాపిస్తుందని, పోలియో ఒక ప్రమాదకరమైన వ్యాధి అని ఇది ముఖ్యంగా కలుషితమైన ఆహారము మరియు నీరు, పోలియో సోకిన వ్యక్తి మలము ద్వారా ఈ వైరస్ బయటకు వస్తుందని,చేతులు సరిగా కడుక్కోకపోవడం వల్ల లేదా పారిశుద్ధ్య లోపాలు ఉన్నప్పుడు ఈ వైరస్ ఆహారము,తాగునీటి ద్వారా ఇతరుల శరీరంలోకి నోటి ద్వారా ప్రవేశిస్తుందని ఇది ప్రధానంగా ఐదు సంవత్సరాల లోపు పిల్లలను ప్రభావితం చేసి, శాశ్వత పక్షవాతానికి గురిచేస్తుందని పేర్కొనడం జరిగింది. పోలియో వ్యాధిని పూర్తిగా నివారించడానికి ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు జాతీయ వ్యాధి నిరోధక టీకాల షెడ్యూల్ ప్రకారం పోలియో చుక్కలు, పోలియో టీకాలు వేయించడం అత్యంత ముఖ్యమైనదని పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని , భారతదేశంలో 2011 నుంచి ఇంతవరకు ఒక్క పోలియోకేస్ కూడా నమోదు కాలేదని అలాగే తెలంగాణ రాష్ట్రంలో 2007 సంవత్సరం తర్వాత నుంచి ఇంతవరకు ఒక కేసు పోలియో పాజిటివ్ నమోదు కాలేదని, పోలియోపై అపోహలను నమ్మకుండా ఆరోగ్య సిబ్బంది సూచనలు పాటించాలని తెలియజేశారు.

కొత్తగూడెం సఫాయి బస్తి ఏరియాలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్





49 వాహనాలపై జరిమానాలు, 87 మద్యం సీసాలు స్వాధీనం.

భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / అక్టోబర్ 23 / అక్షరం న్యూస్ –:

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు కొత్తగూడెం 3 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సఫాయి బస్తి ఏరియాలో శుక్రవారం తెల్లవారు జామున 4:00 గంటల నుంచి ఉదయం 7:00 గంటల వరకు కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ పర్యవేక్షణలో సబ్ డివిజన్ పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 47 ద్విచక్ర వాహనాలు, 2 త్రిచక్ర వాహనాలను గుర్తించి మొత్తం 49 వాహనాలపై చట్టప్రకారం జరిమానాలు విధించారు. అదేవిధంగా 87 ఐఎంఎఫ్ఎల్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

ఈ సందర్భంగా కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమంలో భాగంగా డీఎస్పీ ఆదినారాయణ స్థానికులతో మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఎన్డీపీఎస్ చట్టం కింద ఎదురయ్యే చట్టపరమైన పరిణామాలపై అవగాహన కల్పించారు. గంజాయి సేవించే వ్యక్తుల గురించి లేదా మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. మాదకద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి డీ-అడిక్షన్ కేంద్రాలకు తరలించి, అవసరమైన చర్యలు చేపట్టేందుకు పోలీసులకు సహకరించాలని కోరారు.తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను నిరంతరం గమనిస్తూ, వారు ఎవరితో స్నేహం చేస్తున్నారు, ఎక్కడికి వెళ్తున్నారు అనే విషయాలపై తగిన పర్యవేక్షణ ఉంచాలని సూచించారు.పేకాట, జూదం, మట్కా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.సైబర్ నేరాల నియంత్రణలో భాగంగా ఓటీపీ, యూపీఐ మోసాలు, నకిలీ ఫోన్ కాల్స్, అనుమానాస్పద లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని, ప్రాంతంలో మతసామరస్యాన్ని కాపాడాలని కోరారు.ఈ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో సీఐలు ఇంద్రసేనారెడ్డి, జితేందర్‌తో పాటు పోలీసు అధికారులు, సుమారు 80 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





యూత్ ఫుల్ లవ్ ఎమోషన్స్‌తో ఆకట్టుకునే జెన్ జీ ప్రేమకథ!

టాలీవుడ్‌లో వైవిధ్యమైన ప్రేమకథా చిత్రాలకు ఎప్పుడూ ఆదరణ ఉంటుంది. తాజాగా యువరాజ్ చిన్నస్వామి దర్శకత్వంలో తెరకెక్కిన 'హైకూ' సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. డాక్టర్ అరుళానంధు, మ్యాథ్యూ అరుళానంధు నిర్మించిన ఈ చిత్రంలో శ్రీదేవి, ఏగెన్, ఫెమినా జార్జ్, మైమ్ గోపి తదితరులు ప్రధాన పాత్రల్లో నటించారు.

కథ

గర్ల్స్ కాలేజీలో చేరిన ఏకైక అబ్బాయి మనోహర్ (ఏగన్) అమ్మాయిల చేత ర్యాంగింగ్‌కు గురవుతుంటాడు. ఆ సమయంలో అదే కాలేజీకి చెందిన జాబిలి అలియాస్ కోడి (శ్రీదేవీ) పరిచయం కాస్తా స్నేహంగా, ఆ తర్వాత ప్రేమగా మారుతుంది. అయితే పెళ్లి వరకు వెళ్లిన వీరి బంధానికి కొన్ని కారణాల వల్ల బ్రేక్ పడుతుంది. బ్రేకప్ తర్వాత కూడా ఆ జ్ఞాపకాలతోనే మనో జీవితం సాగిస్తుంటాడు. ఈ క్రమంలో తన కంపెనీలో అప్రెంటీస్‌గా చేరిన నివేదా (ఫెమినా జార్జ్)కు మనో మేనేజర్‌గా ఉంటాడు. ఆ పరిచయం స్నేహంగా మారి, అప్పటికే లవ్ రిలేషన్‌షిప్ బ్రేకప్‌తో బాధపడుతున్న నివేదా, మనో ఇద్దరూ ప్రేమలో పడతారు. అయితే పాత జ్ఞాపకాలు, గత అనుభవాలు వీరి ప్రేమకు ఎలాంటి అడ్డంకులు సృష్టించాయి? చివరకు మనో, జాబిలి, నివేదాల ప్రేమకథల ప్రయాణం ఎలాంటి ముగింపునకు చేరింది? అనేదే ఈ చిత్ర అసలు కథ.

డబుల్ బెడ్ రూం ఇండ్లకు మోక్షం ఎప్పుడో ?

.బీఆర్ఎస్ మాజీ పట్టణ అధ్యక్షుడు లోకా రాజేశ్వర్ రెడ్డి డిమాండ్



చొప్పదండి /కరీంనగర్,అక్టోబర్ 23 (అక్షరం న్యూస్) డబుల్ బెడ్ రూం ఇండ్లకు మోక్షం ఎప్పుడని బీఆర్ఎస్ మాజీ చొప్పదండి పట్టణ అధ్యక్షుడు లోకా రాజేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు లక్ష్మణ్ కుమార్ ఇట్టి విషయం పై దృష్టి పెట్టాలి, ముఖ్యంగా చెప్పాలంటే టౌన్ లో డబల్ బెడ్ రూమ్ ఇళ్లకు సంబంధించి నిర్మాణం పూర్తి కానటువంటి ఇల్లులను పూర్తిచేసి బడుగు బలహీన వర్గాలకు అందజేయాలి,ఈ కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పడి గత మూడు సంవత్సరాలు కాలం గడుస్తున్న ఇంతవరకు అన పైసా కూడా డబల్ బెడ్ రూమ్ కు బడ్జెట్ పెట్టలేదు. ఇప్పటికైనా ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలోనాయకులు మేలుకొనినియోజకవర్గంల,మండల,టౌన్ గ్రామ నాయకులు సోయికచ్చి ఇప్పటికైనా డబల్ బెడ్ రూమ్ విషయంపై మీకు సంబంధించిన నాయకులకు, లీడర్లకు లేదా,ఎమ్మెల్యే లకు,మినిస్టర్లకు ఇట్టి విషయంపై కాంగ్రెస్ నాయకులు పై వారి దృష్టికి తీసుకువెళ్లి తగినంత బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చెయ్యాలి అని బిఆర్ఎస్ చొప్పదండి మాజీ పట్టణ అధ్యక్షుడు లోక రాజేశ్వర్ రెడ్డి డిమాండ్ చేస్తూ.వెంటనే ఇండ్లను పూర్తి చేసి అసలైన నిరుపేదలకు బడుగు బలహీన వర్గాలకు అందించవలసిందిగా సూచన చేస్తూ.ముఖ్యంగా చొప్పదండిలో మున్సిపల్ ఎలక్షన్ ముందు హుటాహుటిగా చొప్పదండి టౌన్ కు సంబంధించిన డబల్ బెడ్ రూమ్ 30 నుండి 50 శాతం పూర్తికాని ఇండ్లను కేటాయిస్తున్నాము అని చెప్పి అమాకమైన ప్రజలకు మోసం చేస్తూ వారికి ప్రొసీడింగ్ పేపర్ పేరుతో పట్టా కాగితం దానిపైన ఎవరిది ఎన్నో ఫ్లోర్ రూమ్ నెంబర్ లేకుండా అందజేశారు.

కౌన్సిలర్ లు గెలిచి దాదాపు సంవత్సరం కాలం పూర్తి కానున్నది అయినా కానీ ఈ విషయం గురించి పట్టించుకున్న నాయకుడు లేడని, డబల్ బెడ్ రూమ్ ఒక బూత్ బంగ్లా లాగా మారిపోయింది ఆకతాయిలకు ఒక అడ్డా లాగా మారిపోయింది ముఖ్యంగా పక్కనే ఉన్న ఇందిరమ్మ ఇండ్లకు అప్పటి సీఎం రాజశేఖర్ రెడ్డి పీరియడ్ లో బడుగు బలహీన వర్గాల కోసం ఇందిరమ్మ ఇండ్లకు స్థలాలు కేటాయించి ఇచ్చినారు. ఇక్కడ నివసిస్తున్న వారికి కనీస మౌలిక సదుపాయాలు చేయలేరు. ఇందిరమ్మ ,డబల్ బెడ్ రూమ్ ఇళ్ల దగ్గరికి వెళ్లడానికి సరైన రోడ్డు వ్యవస్థ కూడా లేదు,డ్రైనేజీ నిర్మాణం, కరెంటుకు సంబంధించిన స్తంభాలు, తాగడానికి వాటర్ సప్లై,వీధి దీపాలు కూడా ఇంతవరకు ఏర్పాటు చేయలేదు. తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ అధికారంలోకి రాగానే అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ పథకాలు ప్రజలకు అందించే విధంగా పని చేసినారు, రెండవసారి కెసిఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత పేదలకు ఉండడానికి ఇల్లు తినడానికి తిండి ఉండే విధంగా అసలైన పేదవాడికి డబల్ బెడ్ రూమ్ నిర్మాణం మొదలుపెట్టారు తెలంగాణలో 70 శాతం వరకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పూర్తిచేసుకుని ఉన్నాయి ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు గడుస్తున్నా డబుల్ బెడ్ రూమ్ పేదలకు ఇవ్వడం విషయంలో కాలయాపన ఎందుకు చేస్తున్నారు. అక్కడక్కడ 30 శాతం పూర్తికానటువంటి ఇండ్లను పూర్తి చేసి పేదవారికి ఉండే విధంగా అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసి ఇవ్వాల్సిందిగా హెచ్చరిస్తున్న బిఆర్ఎస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షుడు లోక రాజేశ్వర్ రెడ్డి డబుల్ బెడ్ రూమ్ విషయంపై మండిపడుతూ వెంటనే ప్రొసీడింగ్ పత్రాలు ఇచ్చిన వారికి గృహప్రవేశం చేసే విధంగా ఆశవాహులు బడుగు బలహీన వర్గాలకు అందజేయాల్సిందిగా కోరుతున్నానని అన్నారు.

జింబాబ్వేపై భారత్ ఘన విజయం!



షఫాలీ విధ్వంసం.. రావల్ శతకం..

జింబాబ్వేతో జరుగుతున్న వన్డే సిరీస్‌లో భారత మహిళల జట్టు బోణీ కొట్టింది. వడోదర వేదికగా జరిగిన తొలి వన్డేలో ప్రతికా రావల్ అజేయ శతకంతో చెలరేగగా.. షఫాలీ వర్మ విధ్వంసకర బ్యాటింగ్‌తో అదరగొట్టింది. దీంతో తొలి వన్డేలో భారత్ తొమ్మిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత జింబాబ్వే 49.5 ఓవర్లలో 197 పరుగులకు ఆలౌట్ కాగా.. లక్ష్యాన్ని భారత్ 26.2 ఓవర్లలోనే ఛేదించింది. మూడు వన్డేల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

శ్రీ చరణి దెబ్బకు కుప్పకూలిన జింబాబ్వే

టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే భారత బౌలర్ల ధాటికి పరుగులు చేయడానికి ఇబ్బందిపడింది. 49.5 ఓవర్లలో కేవలం 197 పరుగులకు ఆలౌటైంది. ఎన్.శ్రీ చరణి అద్భుతంగా బౌలింగ్ చేసి 10 ఓవర్లలో మూడు మెయిడెన్లతో 23 పరుగులిచ్చి నాలుగు వికెట్లు పడగొట్టింది. వన్డేల్లో ఆమెకిదే అత్యుత్తమ ప్రదర్శన కావడం గమనార్హం.

క్రాంతి గౌడ్ మూడు వికెట్లు తీయగా.. దీప్తి శర్మ రెండు వికెట్లతో సత్తా చాటింది. షఫాలీ వర్మ ఒక వికెట్ పడగొట్టింది. దీంతో జింబాబ్వే 70 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో 17 ఏళ్ల బెలవ్డ్ బిజా పట్టుదలగా ఆడింది. 92 బంతుల్లో ఐదు ఫోర్లతో 62 పరుగులు చేసి జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించింది. మిచెల్ మవుంగా 23 బంతుల్లో 29 పరుగులు చేసింది.

రావల్ శతకం.. షఫాలీ సిక్సర్ల వర్షం

198 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఓపెనర్లు ప్రతికా రావల్, స్మృతి మంధాన శుభారంభం అందించారు. వీరిద్దరూ తొలి వికెట్ కోల్పోయేసరికి 94 పరుగులు జోడించారు. మంధాన 34 బంతుల్లో 32 పరుగులు చేసి ఔటైంది.ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన షఫాలీ వర్మ.. రావల్తో కలిసి జింబాబ్వే బౌలర్లపై విరుచుకుపడింది. బౌండరీలు, సిక్సర్లతో స్కోరుబోర్డును పరుగులు పెట్టించింది. కేవలం 29 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసుకుంది. మొత్తంగా 33 బంతుల్లో నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో అజేయంగా 64 పరుగులు సాధించింది.

మరోవైపు రావల్ సంయమనంతో ఆడుతూ అవసరమైన సమయంలో బౌండరీలు బాదింది. 96 బంతుల్లో 15 ఫోర్లతో అజేయంగా 100 పరుగులు చేసింది. వన్డేల్లో ఆమెకిది మూడో శతకం. గాయం నుంచి తిరిగొచ్చిన తర్వాత ఈ సెంచరీ సాధించడం ఆమెకు ప్రత్యేకంగా నిలిచింది.

22.5 ఓవర్లు మిగిలుండగానే..

రావల్, షఫాలీ రెండో వికెట్‌కు అజేయంగా 106 పరుగులు జోడించారు. రావల్ వరుసగా రెండు ఫోర్లు బాది శతకం పూర్తి చేసుకోగా.. ఆ తర్వాత షఫాలీ విన్నింగ్ బౌండరీతో మ్యాచ్‌ను ముగించింది. భారత్ 26.2 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. మరో 22.5 ఓవర్లు మిగిలుండగానే తొమ్మిది వికెట్ల తేడాతో విజయం సాధించింది.

ఆసియా పారా క్రీడల్లో భారత్ సరికొత్త చరిత్ర..



114 పతకాలతో రికార్డు!

ఆసియా పారా క్రీడల్లో భారత అథ్లెట్లు సరికొత్త చరిత్ర సృష్టించారు. జపాన్‌లోని ఐచి-నాగోయాలో జరిగిన ఈ పోటీల్లో భారత్ మొత్తం 114 పతకాలు సాధించింది. ఇందులో 30 స్వర్ణాలు, 35 రజతాలు, 49 కాంస్యాలు ఉన్నాయి. గత ఆసియా పారా క్రీడల్లో 108 పతకాలను సాధించగా.. ఈసారి ఆ రికార్డును అధిగమించి, భారత్ తన అత్యుత్తమ ప్రదర్శనను నమోదు చేయడం విశేషం. ఫలితంగా పతకాల పట్టికలో భారత్ నాలుగో స్థానంలో నిలిచింది. అయితే, దక్షిణ కొరియా ప్రదర్శనను బట్టి తుది ర్యాంకులో మార్పు ఉండే అవకాశం ఉంది.

చివరి రోజూ పతకాల వేట

పోటీల చివరి రోజున భారత అథ్లెట్లు అద్భుత ప్రదర్శన చేశారు. పురుషుల జావెలిన్ త్రోలో సుమిత్ అంటిల్ 72.46 మీటర్ల దూరం విసిరి స్వర్ణం సాధించాడు. ఇదే విభాగంలో మహేంద్ర గుర్జర్ రజతం, సందీప్ సర్గర్ కాంస్యం గెలుచుకున్నారు. పురుషుల క్లబ్ త్రో ఎఫ్51 విభాగంలో ప్రణవ్ సూర్మా 32.87 మీటర్లతో ఆసియా పారా క్రీడల రికార్డు నెలకొల్పి స్వర్ణం సాధించాడు. ఈ పోటీల్లో అతడికి ఇది రెండో స్వర్ణం. ధరంబీర్ కాంస్య పతకంతో సత్తా చాటాడు.

పురుషుల జావెలిన్ త్రో ఎఫ్40/ఎఫ్41 విభాగంలో నవదీప్ సింగ్ 42.55 మీటర్ల దూరం విసిరి కాంస్యం సాధించాడు. పురుషుల 100 మీటర్ల టీ44 విభాగంలో సందీప్ 11.67 సెకన్లలో లక్ష్యాన్ని చేరి కాంస్య పతకం గెలుచుకున్నాడు. అంతకుముందు 400 మీటర్ల టీ44 విభాగంలో స్వర్ణం సాధించిన సందీప్.. ఈ పోటీల్లో రెండో పతకాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు.

బ్యాడ్మింటన్‌లోనూ మెరుపులు

పారా బ్యాడ్మింటన్‌లో భారత క్రీడాకారులు కీలక విజయాలు అందించారు. పురుషుల సింగిల్స్ ఎస్ఎల్3 ఫైనల్లో నితేశ్ కుమార్ 21-18, 21-16తో సహచరుడు ప్రమోద్ భగత్‌పై గెలిచి స్వర్ణం సాధించాడు. ఇదే పోటీలో ప్రమోద్‌కు రజతం దక్కింది. పురుషుల సింగిల్స్ ఎస్ఎల్4 విభాగంలో నవీన్ శివకుమార్ 21-9, 21-17తో ఇండోనేసియాకు చెందిన ఫెర్డీ సెటియావాన్‌ను ఓడించి స్వర్ణం గెలుచుకున్నాడు.

మహిళల డబుల్స్ ఎస్ఎల్3-ఎస్యూ5 ఫైనల్లో తులసిమతి మురుగేశన్, మానసి జోషి జోడీ 21-16, 21-13తో చైనాకు చెందిన యాంగ్ క్విక్సియా, జియావో జుజియాన్ జంటను ఓడించి పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. మిక్స్‌డ్ డబుల్స్ ఎస్ఎల్3-ఎస్యూ5 ఫైనల్లో తులసిమతి మురుగేశన్, నితేశ్ కుమార్ జోడీ రజతంతో సరిపెట్టుకుంది.

షూటింగ్‌లో మోనా అగర్వాల్ స్వర్ణం

మహిళల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ ఎస్‌హెచ్1 విభాగంలో మోనా అగర్వాల్ ప్రపంచ రికార్డు ప్రదర్శనతో స్వర్ణ పతకం సాధించింది. 357.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచిన ఆమె.. ఈ క్రీడల్లో రెండో స్వర్ణాన్ని అందుకుంది. ఇదే పోటీలో అవనీ లేఖరా నాలుగో స్థానంలో నిలిచి పతకాన్ని చేజార్చుకుంది.

పురుషుల 400 మీటర్ల టీ44 విభాగంలో సందీప్ కుమార్ 52.28 సెకన్లలో లక్ష్యాన్ని చేరి ప్రపంచ రికార్డుతో స్వర్ణం సాధించాడు. అజయ్ కుమార్ 53.61 సెకన్లతో కాంస్యం గెలుచుకున్నాడు. జావెలిన్ త్రో ఎఫ్37 విభాగంలో హనేయ్ 60.49 మీటర్ల దూరం విసిరి ప్రపంచ రికార్డుతో పసిడి పతకం సాధించాడు.పురుషుల రికర్వ్ టీమ్ ఈవెంట్‌లో హర్విందర్ సింగ్, విజయ్ సుండి జోడీ చైనాను 5-1తో ఓడించి స్వర్ణం గెలుచుకుంది. మహిళల రికర్వ్ విభాగంలో భారత జోడీ రజతం సాధించింది. ఈసారి పారా అథ్లెటిక్స్‌లో భారత్ మొత్తం 65 పతకాలు సాధించడం విశేషం.

జపాన్‌లోనూ డార్లింగ్ మానియా ..

తెలుగులో విషెస్ చెప్పిన విదేశీ అభిమానులు

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. అక్టోబర్ 23న ఆయన 47వ పుట్టినరోజు జరుపుకుంటుండటంతో గురువారం రాత్రి నుంచే వేడుకలు ప్రారంభమయ్యాయి. హైదరాబాద్‌లోని ప్రభాస్ నివాసం వద్ద అభిమానుల సందడి ఒకవైపు కనిపిస్తుంటే.. మరోవైపు జపాన్‌లోనూ డార్లింగ్ పుట్టినరోజు వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా జపాన్ అభిమానులు తెలుగులో పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ వీడియోలు పంచుకోవడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 'బాహుబలి' చిత్రంతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న ప్రభాస్‌కు జపాన్‌లోనూ పెద్ద సంఖ్యలో అభిమానులు ఉన్నారు. ఆయన సినిమాలకు అక్కడ లభించిన ఆదరణతో డార్లింగ్ క్రేజ్ మరింత పెరిగింది.గతంలో ప్రభాస్ జపాన్ పర్యటనకి వెళ్లడంతో అక్కడి అభిమానుల్లో ఆయనపై అభిమానం మరింత బలపడింది. తాజాగా ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా జపాన్‌కు చెందిన అభిమానులు ప్రత్యేకంగా వేడుకలు నిర్వహించారు. నలుపు, బంగారు రంగుల దుస్తులు ధరించి, కేకులు, బెలూన్లు, ప్రభాస్ సినిమాల పోస్టర్లతో వేదికను అలంకరించారు. 'హ్యాపీ బర్త్‌డే ప్రభాస్-సాన్' అంటూ జపనీస్ భాషలో పాటలు పాడుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. అంతేకాదు, కొందరు అభిమానులు తెలుగులోనూ ప్రభాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు. గత ఏడాది ఆయన జపాన్‌కు రావడం తమకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని, ఆయన కొత్త సినిమాలు విడుదలైనప్పుడు భారత్‌కు వచ్చి థియేటర్లలో చూసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నామని పేర్కొన్నట్లు ఆ వీడియోలో తెలిపారు. ఈ వేడుకలకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.



ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నివాసం వద్ద అభిమానులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. అర్ధరాత్రి నుంచే శుభాకాంక్షలు తెలిపేందుకు తరలివచ్చిన అభిమానులు, భారీ కటౌట్లు, జెండాలతో సందడి చేశారు. ప్రభాస్ నినాదాలతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి. మరోవైపు భీమవరం సహా పలు ప్రాంతాల్లోనూ అభిమానులు తమ అభిమాన నటుడి పుట్టినరోజును ఘనంగా నిర్వహించినట్లు సమాచారం. భారీగా అభిమానులు తరలివచ్చే అవకాశం ఉండటంతో జూబ్లీహిల్స్ పరిసరాల్లో పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

బీసీసీఐ నెట్‌వర్త్ తెలిస్తే షాకే..

టాప్ 10 రిచెస్ట్ క్రికెట్ బోర్డులివే

ప్రపంచంలోనే అత్యంత విలువైన క్రికెట్ బోర్డు బీసీసీఐ అనే సంగతి తెలిసిందే. తాజాగా బీసీసీఐ సహా ప్రపంచ దేశాలకు చెందిన క్రికెట్ బోర్డుల విలువను ప్రముఖ సంస్థ బిజినెస్ స్టాండర్డ్ వెల్లడించింది. దీని ప్రకారం భారత క్రికెట్‌ను నడిపించే అధికారిక సంస్థ బీసీసీఐ (ద బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా) అగ్రస్థానంలో ఉంది. ఈ సంస్థ విలువ 2.2 బిలియన్ డాలర్లు అని బిజినెస్ స్టాండర్డ్ సంస్థ అంచనా వేసింది. అంటే మన కరెన్సీలో దాదాపు రూ.20,000 కోట్లకుపైమాటే. క్రికెట్‌లో అత్యంత విలువైన, సంపద కలిగిన టాప్ 10 దేశాల క్రికెట్ బోర్డుల జాబితాను ఈ సంస్థ ప్రచురించింది. ఇందులో బీసీసీఐ టాప్‌లో ఉంటే.. ఆ తర్వాతి స్థానాల్లో అంటే, రెండు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన బోర్డుల సంపద మొత్తం కంటే బీసీసీఐ విలువే ఎక్కువ కావడం గమనార్హం. అది కూడా తర్వాతి మూడు స్థానాల్లో ఉన్న బోర్డుల కంటే బీసీసీఐ విలువ 11 రెట్లు ఎక్కువ. బీసీసీఐ తర్వాత 79 మిలియన్ డాలర్ల విలువతో రెండో స్థానంలో క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ), 59 మిలియన్ డాలర్లతో మూడో స్థానంలో ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ), 55 మిలియన్ డాలర్లతో పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) నాలుగో స్థానంలో ఉంది.ఈ మూడింటి విలువ మొత్తం 193 మిలియన్ డాలర్లుగా ఉంటే.. బీసీసీఐ విలువ 2.2 బిలియన్ డాలర్లు. అంటే, కనీసం రెండు బిలియన్ డాలర్ల వ్యత్యాసం ఉంది. జాబితాలో 51 మిలియన్ డాలర్లతో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) ఐదో స్థానంలో, 47 మిలియన్ డాలర్లతో క్రికెట్ సౌతాఫ్రికా (సీఎస్ఏ) ఆరో స్థానంలో, 38 మిలియన్ డాలర్లతో జింబాబ్వే క్రికెట్ ఏడో స్థానంలో, 20 మిలియన్ డాలర్లతో శ్రీలంక క్రికెట్ (ఎస్ఎల్‌సీ) ఎనిమిదో స్థానంలో, 15 మిలియన్ డాలర్లతో వెస్ట్ ఇండీస్ క్రికెట్ బోర్డ్ తొమ్మిదో స్థానంలో, 9 మిలియన్ డాలర్లతో న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు (ఎన్‌జడ్‌సీ) పదో స్థానంలో నిలిచాయి.

ఇషాన్ కిషన్‌కు గాయం.. రెండో టీ20 మ్యాచ్‌కు దూరం



క్రైస్ట్‌చర్చ్: ఇషాన్ కిషన్ గాయపడ్డాడు. అతని కుడి కాలి తొడకండరం పట్టేసింది. స్వల్ప స్థాయిలో అతను నొప్పితో బాధపడుతున్నాడు. దీంతో అతన్ని కివీస్‌తో జరిగే రెండో టీ20 మ్యాచ్‌కు దూరం పెట్టారు. బీసీసీఐ ఇవాళ ఇషాన్ కిషన్ గాయంపై అప్‌డేట్ ఇచ్చింది. తొలి టీ20 సమయంలో అతను గాయపడ్డాడు. అయితే అతని ఆరోగ్య పరిస్థితిపై బీసీసీఐ మెడికల్ టీమ్ ఫాలోఅవుతున్నది. ఫస్ట్ మ్యాచ్‌లో బ్యాటింగ్ సమయంలో ఇషాన్ కిషన్ బ్యాటింగ్ ఆర్డర్‌లో కూడా మార్పు చేశారు. తొలి వికెట్ పడిన తర్వాత తిలక్ వర్మ, శ్రేయాస్ అయ్యర్ ముందు వరసలో బ్యాటింగ్‌కు దిగారు. రెండో టీ20కి ఇషాన్‌ను తప్పించడంతో.. ఆ బ్యాటర్ స్థానంలో యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీకి ఛాన్సు వచ్చే అవకాశం ఉన్నది. వెస్టిండీస్‌తో జరిగిన సిరీస్‌లో వైభవ్ స్టాండ్స్‌కే పరిమితమైన విషయం తెలిసిందే.

300వ టీ20 మైలురాయిపై భారత్ గురి.. సూర్యవంశీ రీఎంట్రీపై ఉత్కంఠ!

టీ20 ప్రపంచ ఛాంపియన్ భారత్ మరో రికార్డు ముంగిట నిలిచింది. న్యూజిలాండ్‌తో రేపు జరిగే రెండో టీ20లో బరిలోకి దిగడం ద్వారా టీమిండియా 300 అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లు ఆడిన రెండో జట్టుగా చరిత్ర సృష్టించనుంది. మరోవైపు యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ తిరిగి తుది జట్టులోకి వస్తాడా? అన్నది అభిమానుల్లో ఆసక్తి రేపుతోంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇప్పటికే 1-0తో ఆధిక్యంలో ఉన్న భారత్.. రెండో మ్యాచ్‌లోనూ గెలిచి ఆధిక్యాన్ని రెట్టింపు చేయాలని చూస్తోంది. తొలి టీ20లో ఇదే హోగ్లీ ఓవల్ మైదానంలో భారీ లక్ష్యాన్ని ఛేదించి గెలిచిన భారత జట్టు ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగనుంది.

సూర్యవంశీకి అవకాశం దక్కేనా?

తొలి మ్యాచ్‌లో పరుగుల వరద పారించిన భారత జట్టులో బ్యాటర్లు సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, శ్రేయస్ అయ్యర్, నమన్ ధీర్ కీలక పాత్ర పోషించారు. న్యూజిలాండ్ నిర్దేశించిన 226 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి భారత్ టీ20ల్లో తన అత్యధిక విజయవంతమైన ఛేదనను నమోదు చేసింది. అయితే రెండో మ్యాచ్‌కు ముందు వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ గాయంతో దూరమయ్యాడు. కుడి తొడ కండరానికి స్వల్ప గాయం కావడంతో అతడు ఈ మ్యాచ్ ఆడటం లేదు. దీంతో వైభవ్ సూర్యవంశీకి తుది జట్టులో చోటు దక్కే అవకాశాలు పెరిగాయి. అతడికి అవకాశం ఇస్తే అభిషేక్ శర్మతో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించే వీలుంది. అప్పుడు సంజూ శాంసన్ మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చే అవకాశం ఉంటుంది. అయితే తుది జట్టు కూర్పుపై భారత జట్టు యాజమాన్యం ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

అదే పిచ్.. బౌలర్లకు సవాలే!

తొలి టీ20లో రెండు జట్లూ కలిసి భారీగా పరుగులు సాధించడంతో మరోసారి బ్యాటర్ల ఆధిపత్యం కనిపిస్తుందా? అన్న చర్చ సాగుతోంది. అదే మైదానం, అదే పిచ్‌పై మ్యాచ్ జరగనుండటంతో పరిస్థితులు బ్యాటర్లకు అనుకూలించే అవకాశం ఉంది. అయితే ఇప్పటికే ఒక మ్యాచ్ జరగడంతో పిచ్‌పై అరిగిపోయిన భాగాలు బౌలర్లకు కొంత సహకరించవచ్చని తెలుస్తోంది. తొలి మ్యాచ్‌లో భారీ స్కోరు చేసిన న్యూజిలాండ్.. చివరి వరకు పోరాడినా ఓటమి తప్పించుకోలేకపోయింది. ఈసారి బౌలింగ్‌లో మెరుగుపడి, భారత బ్యాటర్ల దూకుడును అడ్డుకోవాలని కివీస్ భావిస్తోంది. వరుసగా రెండో ఓటమి ఎదురైతే ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో తిరిగి పుంజుకోవడం ఆ జట్టుకు కష్టమవుతుంది.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609